సాక్షి 24/7
తూర్పుగోదావరి
మంగళవారం 4-6-2019
EAST GODAVARI
గరిష్టం 39.0° / కనిష్టం 30.0°

# పరిశ్రమలకు అనుగుణంగా పాఠ్యాంశాలు రూపొందించాలి

- విద్యార్థుల్లో నైపుణ్యం పెంచాలి
- ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ దీక్షితులు



సదస్సులో మాట్లాడుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ దీక్షితులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పరిశ్రమలకు అనుగుణంగా పాఠ్యాంశాలు రూపొందించుకోవాలని ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జీవీఎస్ఆర్ దీక్షితులు సూచించారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలో పెట్రోలియం ఇంజినీరింగ్ అండ్ పెట్రోకెమికల్ ఇంజినీరింగ్ (పీఈ, పీసీఈ) విభాగం ఆధ్వర్యంలో 'డౌన్‌స్ట్రీమ్ ప్రాసెసింగ్ ఆఫ్ ఆయిల్ అండ్ గ్యాస్, పెట్రోలియం రిఫైనింగ్' అంశంపై ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పరిశ్రమలకు అనుగుణంగా పాఠ్యాంశాలను రూపొందించి, అందుకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించగలిగితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ప్రయోగశాలల్లో విద్యార్థులు రోజులో 40 శాతం వరకు సమయాన్ని కేటాయించాలని, పరిశ్రమలతో అనుసంధానమయ్యేలా పాఠ్య ప్రణాళికను రూపొందించాలన్నారు. మంగుళూర్ రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పీఎల్) ప్రతినిధి ఆర్.రోజామణి మాట్లాడుతూ పెట్రోలియం శుద్ధి కార్మాగారాలు చాలా పెద్ద పారిశ్రామిక సముదాయాలని, వీటిలో పలు వేర్వేరు ప్రాసెసింగ్ యూనిట్లు, యుటిలిటీ యూనిట్లు, నిల్వ ట్యాంకులు వంటి సహాయక సౌకర్యాలు ఉంటాయన్నారు. అధిక శాతం పెట్రోకెమికల్స్ వాడుతూ కాలుష్యాన్ని పెంచుతున్నారని, దీని బదులు ప్రత్యామ్నాయ చమురు ఉత్పత్తులను వాడటంతోపాటు విద్యుత్ వాహనాలను వాడటం మంచిదని సూచించారు. ప్రిన్సిపాల్ పి.సుబ్బారావు మాట్లాడుతూ అధ్యాపకులు ఆధునిక ప్రపంచీకరణ సవాళ్లను ఎదుర్కొంటూ బోధనారంగంలో అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ విధానాలను పాటిస్తూ తమను తాము నిరూపించుకోవాలని సూచించారు. పెట్రోలియం కోర్సు ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ కేవీ రావు, కో-ఆర్డినేటర్ లింగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.